

నేడు రాష్ట్రానికి ప్రధాని మోదీ

బెంగళూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో విడత ఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుడిగాలి పర్యటన చేపట్టనున్నారు. విజయసంకల్ప సమావేశంలో బెళగావి, చిక్కోడి నియోజకవర్గాల అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు ఉత్తరకన్నడ జిల్లా కేంద్రం శిరసి బహిరంగసభలో భాగస్వామ్యులవుతారు. మధ్యాహ్నం 2 గంటలకు దావణగెరెలో సాయంత్రం బళ్ళారి జిల్లా హొసపేట బహిరంగసభల్లో పాల్గొంటారు. సోమవారం బాగల్కోటె ప్రచారసభలో పాల్గొంటారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర వివరాలను శనివారం ప్రకటించారు.



ఓటు పోటు..!



- తొలి విడతలో గెలుపెవరిదో..?
- అభ్యర్థుల భవిష్యత్తు ఈవీఎంల్లో ● లెక్కలు వేస్తున్న అభ్యర్థులు
- పెరిగిన పోలింగ్‌తో మారనున్న జాతకాలు ● అందరి దృష్టి బెంగళూరు గ్రామీణ వైపే.. ● అగ్రనేతలంతా చలో ఉత్తర

బెంగళూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నెలరోజుల ఉత్కంఠకు తొలి విడత పోలింగ్‌తో తెర పడింది. అయితే ఎవరికి ఓట్లు పడ్డాయో..ఎవరికి విజయం వరిస్తుందో అనేది కుతూహలంగా మారింది. శుక్రవారం రాత్రి దాకా పోలింగ్ సాగింది. బెంగళూరు నగర పరిధిలోని 3 నియోజకవర్గాలు మినహా మిగిలిన అన్ని చోట్ల 70శాతంపైగా పోల్ కావడం సంతోషించే విషయమైంది. అయితే బెంగళూరు నగర పరిధిలో 55శాతం దాటకపోవడంతో ఎవరికి అనుకూలం కానుందనేది కీలకమవుతోంది. 247మంది అభ్యర్థులు బరిలో ఉన్న 14 నియోజకవర్గాల్లో 28మంది మధ్యే ప్రధాన పోటీ సాగింది. బెంగళూరు దక్షిణలో 53.17 శాతం మాత్రమే పోల్ కావడంతో బీజేపీ అభ్యర్థి తేజస్వి సూర్య భవితవ్యం ఏం కానుందనేది చర్చనీయాంశం అవుతోంది. ఈ నియోజకవర్గం బీజేపీకి కంచుకోట. బెంగళూరు సెంట్రల్, బెంగళూరు ఉత్తర నియోజకవర్గాల్లోనూ 54శాతానికే పోలింగ్ పరిమితం కావడంతో ఫలితంలో మార్పు ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే అత్యధికంగా మండ్యలో 81.67శాతం పోలింగ్‌తో ఎన్నిక ఒకేవైపు సాగిందనే అభిప్రాయాలు ఉన్నాయి. ఉడుపి-చిక్కమగళూరు, దక్షిణకన్నడ స్థానాలు సుదీర్ఘకాలంగా బీజేపీకి అనుకూలమైనవి. ఇక్కడ ఎక్కువశాతం పోలింగ్ కావడం ద్వారా ఫలితం ఎలా ఉంటుందనేది చర్చనీయాంశం అయ్యింది. తుమకూరులో 78శాతం పోలింగ్ ద్వారా ఇక్కడ ఎన్నిక ఏకపక్షంగా సాగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బెంగళూరు గ్రామీణలో 68శాతం నమోదు కావడం ఉత్కంఠ అవుతోంది. తొలి విడతలో అన్ని నియోజకవర్గాలకంటే బెంగళూరు గ్రామీణ హై ఓల్టేజ్‌గా సాగింది. హాసన్‌లో 77శాతం పోల్ కావడం కూడా ఉత్కంఠ అవుతోంది. మైసూరులో 70శాతం పోలింగ్ ద్వారా కాంగ్రెస్‌కు కలిసొస్తుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నా, ఎక్కువ పోలింగ్ తమకే అనుకూలమని బీజేపీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. చామరాజనగరలో 76శాతం పోలింగ్ కూడా ఆశాజనకంగా ఉంది. చిత్రదుర్గ, కోలారు, చిక్కబళ్ళాపుర నియోజకవర్గాల్లో 75శాతానికి అటుఇటుగా ఉండడంపై అభ్యర్థులు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



ఉడుపిలో స్ట్రాంగ్ రూం వద్ద భద్రత

లెక్కలు చూసుకుంటున్న అభ్యర్థులు

పోలింగ్ పూర్తి కావడంతో అభ్యర్థులు లెక్కలు చూసుకునే పనిలో నిమగ్నమయ్యారు. శనివారం పోలింగ్ కేంద్రాలవారీగా శాతానికి సంబంధించి రికార్డులు పొందిన అభ్యర్థులు కేంద్రాలవారీగా అంచనాలు వేసుకున్నారు. ప్రతిచోటా అభ్యర్థులు ఇదే పనిలో నిమగ్నమయ్యారు. 75శాతం దాటిన పోలింగ్ కేంద్రాల్లో ఒకే పార్టీకి కలసివస్తాయనే అభిప్రాయాలతో ఉన్నారు. పోలింగ్ ముగియడంతో కాస్త ఊపిరి పీల్చుకున్న అభ్యర్థులు అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా ఇన్‌చార్జ్‌లతోపాటు ఎన్నికల పర్యవేక్షకులతో కలసి గణాంకాలు వేసుకున్నారు.



అగ్రనేతలంతా చలో ఉత్తర

తొలివిడత పోలింగ్ ముగియడంతో ఇటు అభ్యర్థులతోపాటు అధికార పార్టీ నుంచి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు, బీజేపీ నుంచి ముఖ్యనేతలు చలో ఉత్తరకు సిద్ధమయ్యారు. ఆదివారం నాటికి ఉత్తర కర్ణాటకకు అందరూ చేరుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులను వివిధ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లుగా నియమించింది. పరమేశ్వర్‌ను దావణగెరెకు, ధారవాడకు దినేశ్ గుండూరావు, కేపీ జార్జ్ ఉత్తరకన్నడకు, సుధాకర్‌ను చిక్కోడికి, కృష్ణబైరే గౌడను హావేరికి, రామలింగారెడ్డి - బళ్ళారి, డాక్టర్ ఎంసీ సుధాకర్ - బెళగావి, భైరతి సురేశ్ - కొప్పళ, మునియప్ప - రాయచూరు, వెంకటేశ్ - బీదర్, చలువరాయస్వామి - శివమొగ్గ, మహదేవప్ప - బిజాపూర్, రాజణ్ణ - బాగల్కోటలకు నియమిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు డీసీఎం డీకే శివకుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఇక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర రెండు రోజులుగా శివమొగ్గ ప్రాంతంలోనే పర్యటిస్తున్నారు. తొలి విడతల ఎన్నికలు ముగిసిన ప్రాంతాల్లో అభ్యర్థులందరూ కేటాయించిన నియోజకవర్గాలకు వెళ్లాలని విజయేంద్ర సూచించారు.

స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు..

పోలింగ్ సజావుగా ముగియడంతో అభ్యర్థుల భవిష్యత్తు స్ట్రాంగ్‌రూంల్లో భద్రతమైంది. ఈవీఎంలు, వీవీప్యాట్‌లను కేటాయించిన స్ట్రాంగ్‌రూంలకు తరలించారు. బెంగళూరు సెంట్రల్‌కు సంబంధించి వసంతనగర్‌లోని మౌంట్ కార్మెల్ కాలేజ్, బెంగళూరు ఉత్తరకు సంబంధించిన ఈవీఎంలను మల్యారోడ్డులోని సెయింట్ జోసెఫ్ కళాశాలలోనూ, బెంగళూరు దక్షిణకు సంబంధించిన ఈవీఎంలను జయనగర్‌లోని ఎస్ఎస్ఎంవీఆర్ కళాశాలలోనూ భద్ర పరిచారు. తుమకూరు, మండ్య, మైసూరు, చామరాజనగర, కోలారు, చిక్కబళ్ళాపుర, ఉడుపి, దక్షిణకన్నడ, చిత్రదుర్గ, బెంగళూరు గ్రామీణకు సంబంధించిన ఈవీఎంలను జిల్లా కేంద్రాల్లో భద్రపరిచారు. జూన్ 4న కౌంటింగ్‌వరకు ఆయా స్ట్రాంగ్‌రూంలలోనే ఈవీఎంలు ఉంటాయని బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ బీ దయానంద్ వెల్లడించారు. కేంద్ర భద్రతా బలగాలు, స్థానిక పోలీసులు భద్రతను పర్యవేక్షిస్తారన్నారు.



ఈవీఎంలను తరలిస్తూ..

నాటి నుంచి నేటి వరకు పోలింగ్ సరళి


బెంగళూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలతో గత ఎన్నికలను పోలిస్తే పోలింగ్‌శాతం దాదాపు ఒక్కశాతం మాత్రమే మెరుగు అనిపించింది. 2014, 2019, 2024 లోక్‌సభ పోలింగ్ సరళి ఇలా ఉంది.

నియోజకవర్గం	2014	2019	2024
ఉడుపి-చిక్కమగళూరు	74.56	76.07	77.15
హాసన్	73.49	77.35	77.68
దక్షిణకన్నడ	77.15	77.99	77.56
చిత్రదుర్గ	66.07	70.80	73.30
తుమకూరు	72.57	77.43	78.05
మండ్య	71.47	80.59	81.67
మైసూరు	67.30	69.51	70.62
చామరాజనగర	72.85	75.35	76.81
బెంగళూరు గ్రామీణ	66.45	64.98	68.30
బెంగళూరు ఉత్తర	56.53	54.76	54.45
బెంగళూరు సెంట్రల్	55.64	54.32	54.06
బెంగళూరు దక్షిణ	55.75	53.70	53.17
చిక్కబళ్ళాపుర	76.21	76.74	77.00
కోలారు	75.51	77.25	78.27
నగటు పోలింగ్	67.73	68.96	69.56



ఓటుకు రూ.10వేలు పంచిపెట్టారు..

- డీకేపై జేడీఎస్ నేత కుమారస్వామి ఆరోపణలు



బెంగళూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తొలివిడత పోలింగ్ ముగిసినా జేడీఎస్ నేత కుమారస్వామి, డీసీఎం డీకే శివకుమార్‌ల మధ్య వాగ్వాదం కొనసాగుతూనే ఉంది. శనివారం కుమారస్వామి మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు గ్రామీణలో రాత్రంతా డీకే శివకుమార్ కూపన్‌లు పంచారన్నారు. ఓటుకు రూ.10వేలు చొప్పున అందజేశారని ఆరోపించారు. తమ్ముడి గెలుపు కోసం డీకే విలువలను వదిలేశారన్నారు. ఇదే విషయమై డీకే శివకుమార్ కేపీసీసీలో మాట్లాడుతూ కుమారస్వామి రోజుకో ఆరోపణ చేస్తారన్నారు. బెంగళూరు గ్రామీణలో బీజేపీ ద్వారా బావను పోటీ చేయించి ప్రచారం చేశారన్నారు. నీతి మాటలు చెప్పే కుమారస్వామి హాసన్‌లో ఎంతోమందిమహిళలకు సంబంధించిన పెన్‌డ్రైవ్‌లలో వచ్చిన అంశాలపై వివరణ ఇస్తే బాగుంటుందన్నారు. ఒకప్పుడు నా దగ్గర బదిలీలకు సంబంధించి పెన్ డ్రైవ్ ఉందని కుమారస్వామి బెదిరించిన అంశాన్ని గుర్తు చేశారు. బహుశా ఆ పెన్ డ్రైవ్ ఇదే అయి ఉంటుందని ఎద్దేవా చేశారు.



కరువు రైతుకు కానుక

- నెలల పోరాటానికి దక్కిన కరువు పరిహారం ● కేంద్రం నుంచి రూ.3,454 కోట్లు
- 230 తాలూకాలను కరువు ప్రాంతాలుగా ప్రకటన ● సుప్రీం కోర్టు జోక్యంతోనే కదిలిన కేంద్రం ● నేడు విధానసౌధ వద్ద నిరసన : సీఎం



బెంగళూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలకొన్న కరువుకు పరిహారం విషయంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నిర్ణయాలపై సాగిన పరంపర మరిన్ని మలుపులు తిరుగుతోంది. 2023లో ఖరీఫ్ సీజన్ ప్రారంభంనుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురవలేదు. 240 తాలూకాలకు గాను 230 తాలూకాల్లో కరువు నెలకొంది. రాష్ట్రంలో కరువుతో అన్ని వర్గాలు ఇబ్బంది పడుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం పరిహారం కోసం కేంద్రాన్ని కోరింది. రాష్ట్రంలో వర్షాభావంతో ప్రాజెక్టులు ఎండిపోయి తాగునీటికి ఇబ్బంది ఏర్పడింది. పశుగ్రాసం సహా ఉపాధి పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. దీనికితోడు ఎండల ప్రభావం పెరగడంతో సమస్యలు తీవ్రమయ్యాయి. ఇదే తరుణంలో కేంద్రం నుంచి అందిన పరిహారం కొంతమేర ఉపశమనం కలిగించినట్లయ్యింది.



పంటనష్ట పోయిన పొలాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం(ఫైల్)

- సీఎం సిద్దరామయ్య ఢిల్లీ వెళ్లి స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలసి కరువు పరిస్థితిని వివరించారు. ఆ తర్వాత కేంద్ర అధ్యయన బృందాలు రాష్ట్రంలో పర్యటించి అంచనా వేశాయి. ఇదంతా 2023 చివరినాటికి ముగిసింది. 2024 జనవరి నుంచి పరిహారం వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అయితే కేంద్రం నుంచి గ్రాంట్లు విడుదల కాలేదు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. విచారణ జరిపిన ధర్మాసనం సమాఖ్య వ్యవస్థలో ఇటువంటి విధానాలు సరికాదని, పరిహారంపై స్పష్టత ఇవ్వాలని కేంద్రాన్ని సూచించింది. వారం రోజుల్లోనే కేంద్రం ఒక నిర్ణయం తీసుకుంటుందని కేంద్రప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ స్పష్టం చేశారు. ఈలోగానే శనివారం కేంద్రప్రభుత్వం రూ.3,454 కోట్ల పరిహారం విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు జోక్యంతోనే రాష్ట్రానికి పరిహారం దక్కిందని సీఎం సిద్దరామయ్య వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు నిర్ణయందాకా ఒక్కపైసా కూడా విడుదల చేయలేదని మండిపడ్డారు. అయితే కేంద్రప్రభుత్వం విడుదల చేసిన నిధులు తమ డిమాండ్‌కు అనుగుణంగా లేవని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 48లక్షల హెక్టార్లలో పంట సాగు లేదని, 35వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ఎన్‌డీఆర్ఎఫ్ మార్గదర్శకాలకు అనుగుణంగా 18,172 కోట్ల రూపాయల పరిహారం కోరామన్నారు. కానీ కేంద్రం కేవలం రూ.3,454 కోట్లు మాత్రమే విడుదల చేసిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కరువు సాయం అందించినట్లుగానే ఉన్నా తాము కోరినంత విడుదల చేయలేదని మండిపడ్డారు. ● అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదానికి దారి తీసిన కరువు పరిహారం ఎట్టకేలకు విడుదల కావడంపై బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నా, కాంగ్రెస్ నాయకులు మాత్రం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంపై పోరాటానికి దిగుతామని, రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని అంటున్నారు.

నేడు కాంగ్రెస్ నేతల నిరసన

కేంద్రం కరువుసాయం విడుదలలో వివక్ష చూపిందని ఆరోపిస్తూ ఆదివారం విధానసౌధ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తామని సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. కాగా డీసీఎం డీకే శివకుమార్ స్పందిస్తూ ఆకలితో ఉన్న ఏనుగుకు మజ్జిగ ఇచ్చినట్లుగా పరిహారం ఇచ్చారని కేంద్రంపై మండిపడ్డారు. కాగా మంత్రులు కృష్ణబైరేగౌడ, ఎంబీ పాటిల్ సహా పలువురు స్పందించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతోనే పరిహారం ఇచ్చారని నివేదికకు అనుగుణంగా కేంద్రం స్పందించాల్సి ఉండేదని మండిపడ్డారు.

పేమెంట్ రాలేదనే నామినేషన్ ఉపసంహరణ

- దింగాలేశ్వరస్వామిపై బీజేపీ సీనియర్ నేత యత్నాళ్ సంచలన వ్యాఖ్యలు



బెంగళూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ధారవాడ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన దింగాలేశ్వరస్వామికి పేమెంట్ రాలేదనే నామినేషన్ ఉపసంహరించారని బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ ఆరోపించారు. శనివారం హుబ్బళ్ళిలో మీడియాతో మాట్లాడిన ఆయన డబ్బుల కోసం కాకుంటే ఎందుకు నామినేషన్ వేశారని ప్రశ్నించారు. నామినేషన్ వేస్తే పోటీలో కొనసాగాలని అలా కాకుండా మధ్యలోనే వెనుకడుగు వేయడం వెనుక భారీ ఆలోచన ఉందన్నారు. ఇదే సందర్భంలోనే మాజీ మంత్రి ఈశ్వరప్ప ఇండిపెండెంట్‌గా పోటీ చేసే విషయమై మాట్లాడుతూ అధిష్ఠానం సూచన మేరకు ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ కాకుండా పార్టీ కోసం పనిచేశారన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయనకు న్యాయం చేయాల్సిందన్నారు. కానీ అలా జరగలేదన్నారు. ఎక్కడో తప్పు జరిగిందని ఎన్నికల తర్వాత అన్నీ చక్కదిద్దుకుంటాయన్నారు. కాగా కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి లింగాయతల పట్ల శక్తివంతంగా ఉన్నారన్నారు. తప్పుడు ప్రచారానికి చోటివ్వరాదన్నారు. గతంలో రామకృష్ణహెగ్డే, అనంతకుమార్, ప్రస్తుతం ప్రహ్లాద్ జోషిలు లింగాయతుల తరపున గట్టిగా నిలబడినవారన్నారు. సీఎం సిద్దరామయ్య, కాంగ్రెస్ పార్టీ లింగాయతలకు వ్యతిరేకమని, గతంలో రిజర్వేషన్ పేరిట విభజించే ప్రయత్నం చేశారన్నారు. 2డీ కోటా విషయమై చర్చించేందుకు ప్రయత్నించగా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ఆ అవకాశం మీకు రాదని తేల్చి చెప్పారన్నారు.



మామిడి మాయం



- ఈ ఏడు భారీగా తగ్గిన మామిడిపండ్ల దిగుబడి ● వాతావరణ మార్పులే కారణమంటున్న అధికారులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 27: వేసవిలో నోరూరించే మామిడి పండ్లు తినాలని ఎవరికైనా ఆశగా ఉంటుంది. అయితే ఈ ఏడాది మామిడి దిగుబడి భారీగా పడిపోయింది. అరకొర పంట కారణంగా ధరలు ఆకాశన్నంటుతున్నాయి. శిడ్లఘట్ట తాలూకా ప్రాంతం మామిడి సాగుకు ఎంతో అనుకూలమైనది. అయితే రెండేళ్లుగా ఆశించిన మేరకు తగిన వర్షాలు కురవకపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. కర్ణాటక రాష్ట్ర మామిడి అభివృద్ధి, మార్కెట్ మండలి (కేఎస్ఎండీఎంసీఎల్) డైరెక్టర్ సీజీ నాగరాజ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 1.49లక్షల ఎకరాల్లో మామిడి సాగు అవుతుందన్నారు. ఏటా సరాసరి 12-15లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి మార్కెట్‌కు వస్తుండేదని, ఈసారి మాత్రం కేవలం 5లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే దిగుబడి వచ్చిందన్నారు. మహారాష్ట్ర సహా దక్షిణభారతదేశమంతటా దాదాపు ఇదే పరిస్థితి నెలకొందన్నారు. వాతావరణంలో నెలకొన్న మార్పులతో మామిడి దిగుబడి తగ్గిందన్నారు. ఇప్పటికే అల్ఫోన్సో సింధూర, రసపురి, కేసరి రకాలు మార్కెట్‌కు వచ్చాయని అయితే కొనుగోలుదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదన్నారు. రామనగర, ఉత్తర కర్ణాటక పండ్ల విక్రయాలు సాగుతున్నాయన్నారు. చిక్కబళ్ళాపుర, చింతామణి, సరిహద్దులోని ఆంధ్ర ప్రాంతాల వ్యాపారులు ఆసక్తి కాస్త చూపుతున్నారన్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మామిడిపండ్లు

సొమ్ము కన్నడిగులది.. సోకు సుర్జేవాలాది

- రైతులను ఆదుకునేందుకు సొమ్ము లేదంటారు ● ప్రత్యేక విమానాలకైతే ఖర్చు చేస్తారు ● బీజేపీ మండిపాటు

బెంగళూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కన్నడిగుల సొమ్ములో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా సోకులు కొడుతున్నారని రాష్ట్ర బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కన్నడిగులకు కరువు పరిహారానికి అభివృద్ధికి నిధులు ఇచ్చేందుకు ఖజానా ఖాళీ అయ్యిందని కర్ణాటక ప్రభుత్వం చెప్పుకుంటోందన్నారు. ఈమేరకు శనివారం పార్టీ ఎక్స్ ద్వారా నాయకులు మండిపడ్డారు. సొమ్ములు లేని రాష్ట్ర ప్రభుత్వం కలెక్షన్ ఏజెంట్ సుర్జేవాలా ఎన్నికల ప్రచారంకోసం మాత్రం ప్రత్యేక ఫ్లైట్‌లను ఏర్పాటు చేస్తోందని ఎద్దేవా చేసింది. ఏటీఎం ప్రభుత్వం లూటీ సొమ్ముతో దేశవ్యాప్తంగా ఎన్నికలకు ఖర్చు చేస్తోందని మండిపడింది. ఢిల్లీ నుంచి నేతలు వచ్చారంటే ఆర్భాటంగా సభలు నిర్వహించడం, ప్రత్యేక విమానాల్లో నాయకులను తరలించడం వారికి అలవాటేనన్నారు. కానీ రైతులను ఆదుకునేందుకు మాత్రం చేతులు రావన్నారు.

కేంద్ర పరిహారంపై బీజేపీ సంతృప్తి

కేంద్రప్రభుత్వం రాష్ట్రంలో కరువుకు సంబంధించి రూ.3,454 కోట్లు విడుదల చేయడంపై బీజేపీ హర్షం వ్యక్తం చేసింది. కరువు పరిహారం విడుదల చేయడాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ప్రత్యేకంగా కొనియాడారు. కేంద్రప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

జన కేతనం
ఆంధ్రజ్యోతి





అల్లుడికి అగ్ని పరీక్షే..



- ఖర్గే కోట అల్లుడు రాధాకృష్ణకు వశమయ్యేనా
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలపైనే ఆశలన్నీ
- మోదీ హవాతో ఎంపీ జాదవ్ గట్టెక్కేనా..?


రాధాకృష్ణ దొడ్డమని


ఉమేశ్‌జాదవ్

బెంగళూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కందిసాగులో ఖనిజం, మఠాధిపతుల గడ్డగా పేరొందిన కలబురగి (గుల్బర్గా) రిజర్వు నియోజకవర్గం ద్వారానే మల్లికార్జున ఖర్గే జాతీయ స్థాయిలో తిరుగులేని పదవిని దక్కించుకున్నారు. ఆయన కోటలో పాగా వేసేందుకు అల్లుడు రాధాకృష్ణ దొడ్డమని అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఒకప్పటి ఖర్గే శిష్యుడిగా రాణించి ఆయనను ప్రత్యక్ష రాజకీయాల్లో ఘోరంగా ఓడించిన డాక్టర్ ఉమేశ్‌జాధవ్ మరోసారి అదృష్ట పరీక్షకు సిద్ధమయ్యారు. గడిచిన దశాబ్ధకాలంలో ఖర్గే లోక్‌సభలో తిరుగులేని విజయాలు సాధిస్తూ వచ్చారు. 2019 ఎన్నికల్లో మల్లికార్జున ఖర్గేను ఓడించి ఉమేశ్‌జాధవ్ లోక్‌సభ సభ్యుడయ్యారు. ఇక్కడ ఇద్దరు అభ్యర్థులు కేవలం పేరుకు మాత్రమే. ప్రత్యక్షంగా ఇక్కడ ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్సెస్ ఎన్నిక మల్లికార్జున ఖర్గే అనేలా కొనసాగుతోంది. ఐదేళ్లక్రితం నాటి ఓటమిపగను తీర్చుకునేందుకు మల్లికార్జున ఖర్గే వ్యూహాలు రచిస్తున్నారు. తరచూ కలబురగి నేతలతో ఎన్నికల సమీక్ష నిర్వహిస్తున్నారు. నాలుగురోజులక్రితం కలబురగిలో నిర్వహించిన బహిరంగసభలో స్థానికులకు సెంటిమెంట్‌తో కొట్టారు. తనను గెలిపిచేందుకు ఓటేయ్యండి లేదంటే తాను చనిపోతే పూడ్చితే మట్టి వేసేందుకు, కాలిస్తే నిప్పు పెట్టేందుకు రావాలని నియోజకవర్గ ప్రజలను కోరారు. ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని ప్రజలకు పరోక్షంగా కోరినట్లు అయ్యింది. ఇటీవలి ఐదేళ్లలో కలబురగికి మెగా టెక్స్‌టైల్‌పార్క్ మంజూరు చేయించడం, వందేభారత్ రైలు వంటివి ఏర్పాటు చేయడం కలసివస్తాయని బీజేపీ అభ్యర్థి ఉమేశ్‌జాధవ్ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఖర్గే అధికారంలో ఉన్నప్పుడు కర్ణాటకకు 371జే ఆర్టికల్, ఈఎస్‌ఐ ఆసుపత్రులు, రైల్వేకు సంబంధించిన పలు ప్రాజెక్టులను తీసుకొచ్చారు. గత ఎన్నికల్లో ఖర్గేకు దూరంగా ఉన్న కాంగ్రెస్ సీనియర్, బీసీ వర్గాల నేతలు బాబూరావ్ చించన్‌సూర్, మలికయ్యగుత్తేదార్‌లు మళ్లీ కాంగ్రెస్‌కు రావడం కొండంత బలం ఇచ్చినట్లు అవుతోంది.

- కులాల ప్రకారం పరిశీలిస్తే ఉన్నత వర్గాలతోపాటు బంజారాలు 40శాతం బీజేపీకి అనుకూలంగా ఉన్నారు. దళితులు, ముస్లింలతో పాటు మరికొన్ని ఉన్నతవర్గాలతో కలిపి 40శాతం కాంగ్రెస్‌కు బలాన్నిస్తున్నారు 20శాతం బీసీలు ఎవరికి మద్దతు ఇస్తారో వారికే ఎన్నిక అనుకూలం కానుంది. 22,68,944మంది ఓటర్లు కాగా 10,47,961మంది మహిళలు, 10,49,959మంది పురుషులు, ట్రాన్స్‌జెండర్‌లు 282మంది ఉన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలే అధికం

కలబురగి లోక్‌సభ పరిధిలో 8మంది ఎమ్మెల్యేలు ఉండగా ఆరుగురు కాంగ్రెస్, ఒకరు బీజేపీ, ఒకరు జేడీఎస్ ఉన్నారు. కలబురగి దక్షిణ, కలబరగి ఉత్తర, అఫ్జల్‌పుర, జీవర్గి, చిత్తాపుర, సేడంలనుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తుండగా కలబురగి గ్రామీణ నుంచి బీజేపీ, గురుమిట్కల్ నుంచి జేడీఎస్ ఎమ్మెల్యే ఉన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలనాటికి నలుగురు కాంగ్రెస్, ముగ్గురు బీజేపీ, ఒక జేడీఎస్‌లు ఉండేవారు. ప్రస్తుతం ఆరుగురు ఎమ్మెల్యేలు ఉండడంతోపాటు రాష్ట్ర కేబినెట్‌లో కీలకమైనశాఖల మంత్రులుగా ఉన్న ప్రియాంక ఖర్గే, శరణు ప్రకాశ్ పాటిల్ ఇదే ప్రాంతానికి చెందినవారు కావడం కాంగ్రెస్‌కు కలిసి వచ్చే అంశం కానుంది.

కలబురగిలో ప్రధాని తొలిసభ

రాష్ట్రం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలబురగిలో బహిరంగసభ నిర్వహించడం ద్వారా రాష్ట్రంలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ ఎన్నిక ఖర్గేకు ప్రతిష్ఠాత్మకమైంది. ఖర్గే ఏఐసీసీ అధ్యక్షుడిగాను, కుమారుడు ప్రియాంక ఖర్గే ఐటీబీటీశాఖల మంత్రిగా, కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా, ఎన్నికల నిర్వహణా కమిటీ సభ్యుడిగా ఉన్నారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి ఓడితే ఖర్గే కుటుంబంపై పెనుప్రభావం చూపడం ఖాయం. 2019 ఎన్నికల్లో బీజేపీకి చెందిన ఉమేశ్‌జాధవ్‌కు 6.20 లక్షల ఓట్లు రాగా మల్లికార్జున ఖర్గేకు 5.24 లక్షల ఓట్లు వచ్చాయి. బలాబలాలను పరిశీలిస్తే ఉమేశ్‌జాధవ్‌కు ప్రధానమంత్రి హవా చరిష్మా, ఖర్గేకు బదులు అల్లుడు పోటీ చేయడం కలసి రానుంది. బంజారాలు, ఇతర సామాజకవర్గాలు మద్దతిస్తూ ఉండడంతో పైగా కూడా జేడీఎస్ కూడా చేతులు కలపడం కలసివస్తోంది. మైనస్‌లలో ఐదేళ్లలో కేంద్రం నుంచి ఒక ప్రాజెక్టు కూడా తీసుకురాకపోవడం, బీజేపీ నాయకులు నేతల మధ్య సమన్వయం లోపించడం వంటివి ఉన్నాయి. ఇక రాధాకృష్ణకు కలసిరావడం అంటే ఖర్గే అల్లుడిగా చెప్పుకోవడం, ఎక్కువ మంది ఎమ్మెల్యేలు, రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న గ్యారెంటీలు కలసి రావడం వంటివి ఉన్నాయి. ఇక మైనస్‌లలో అనుభవం కొరత, ప్రజల మద్దతుల లేకపోవడం వంటివిగా ఉన్నాయి.




కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

కేఆర్‌పీపీ నుంచి బీజేపీలో చేరిక

సిరుగుప్ప, ఏప్రిల్ 27 : పలువురు కేఆర్‌పీపీ నాయకులు బీజేపీలో చేరారు. పార్టీ తాలూకా కార్యదర్శి బంద్రాల్లు మల్లికార్జున వందలాదిమంది కార్యకర్తలతో కేఆర్‌పీ పార్టీని వీడి శనివారం బీజేపీలో చేరారు. సిరుగుప్ప పట్టణంలో బీజేపీ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప వారికి కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కేఆర్‌పీ పార్టీ అధ్యక్షులు గాలి జనార్ధన్‌రెడ్డి బీజేపీలోకి విలీనం కావడంతో అందరూ బీజేపీ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ బసవరాజు విజయానికి కృషి చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప మాట్లాడుతూ డాక్టర్ బసవరాజు విజయానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ పదేళ్లలో ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షులు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి, ప్రధాన కార్యదర్శి నాగరాజ, బెళగల్ బసవరాజు, లస్కర్ శేకప్ప, బీఎస్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.



సోలార్ ప్యానల్స్

జగనన్నా.. ఇచ్చిన మాట మరిచావా ?

నంబులపూలకుంట, ఏప్రిల్ 27: ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేస్తూ నంబులపూలకుంట మీదుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ సోలార్ హబ్‌కు భూములో కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ. రెండులక్షలు మాత్రమే ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.ఐదు లక్షలు ఇస్తామన్నారు. సాగుదారులకు కూడా రూ.లక్ష భిక్షమిచ్చినట్లు ఇచ్చారని, పట్టాదారు పాసుపుస్తకంతో సమానంగా పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయిన తర్వాత దాని గురించి మరచిపోయారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న రైతులకుల నేటికి పరిహారం అందలేదని వాపోతున్నారు.


ఇష్టమొచ్చినట్లు రాసేసుకోండి

ఫీల్డ్ అసిస్టెంట్లకు కొందరు వైసీపీ నాయకుల సూచన



పుట్లూరు, ఏప్రిల్27: మన గవర్నమెంట్ ఎలాగూ రాదు. మీకు ఇష్టమొచ్చినన్ని మస్టర్లు రాసుకోండి అంటూ కొందరు వైసీపీ నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్లకు బంఫర్ ఆఫర్ ఇస్తున్నారన్న ప్రచారం జోరుగా జరుగుతోంది. ఆమేరకు మండలంలోని పలుగ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు కొందరు ముఖ్యమైన వైసీపీ నాయకులు చెబుతున్నట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వం వచ్చేటట్లు కనిపించడం లేదు బినామీ పేర్లు పెట్టుకొని మీకు ఇష్టమొచ్చినన్ని మస్టర్లు రాసుకొని లబ్ధిపొందండని చెబుతున్నారు. మండలవ్యాప్తంగా సుమారు 18పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మీకు ఏమైనా ఇబ్బంది అయితే టెక్నికల్, సంబంధిత అధికారులు అండగా ఉంటారని హామీ ఇస్తున్నట్లు సమాచారం. దీంతో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్లు ఇష్టమొచ్చినట్లు రాస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లు ఉండటం గమనార్హం.


పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు గడువు పొడిగింపు



అనంతపురం టౌన్, ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగ, ఉపాధ్యాయులకు పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించింది. ఈనెల 26వరకు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉండేది. అయితే వివిధ కారణాలతో పాటు కొంత గందరగోళం నెలకొన్న నేపథ్యంలో చాలామంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోలేక పోయారు. దీంతో పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు గడువును మే1 వరకు పొడిగించినట్లు జిల్లా పోస్టల్‌బ్యాలెట్ విభాగం నోడల్ ఆఫీసర్, డీపీఓ ప్రభాకరరావు తెలిపారు. జిల్లాలో పనిచేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మాత్రమే ఈఅవకాశం ఉంటుందని, ఇతర జిల్లాలలో పనిచేసే వారికి ఉండదని డీపీఓ అన్నారు. జిల్లాలో ఇంకా ఎవరైనా పోస్టల్ బ్యాలెట్‌కు ఫారం-12 దరఖాస్తు చేసుకోకుండా ఉంటే, అలాంటి వారు మే1 వరకు పని చేసే నియోజకవర్గాల ఆర్‌ఓలకు దరఖాస్తు ఫారంలు అందజేయాలని ఆయన తెలిపారు.

టీడీపీలో వలసదారులదే హవా

సత్తా చాటుతున్న పక్క జిల్లా అభ్యర్థులు



గుంతకల్లు, ఏప్రిల్ 27: నియోజవకర్గంలో టీడీపీలో స్థానికుల కంటే పక్క జిల్లా వారిదే హవా నడుస్తూ వస్తోంది. వలస వచ్చి గెలిచినవారిలో అత్యధికులు కర్నూలు జిల్లావారే కావడం గమనార్హం. గుంతకల్లు/గుత్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యేలైనవారి స్థానికతను ఒకసారి పరిశీలిస్తే విషయం విశదమౌతుంది. టీడీపీ తొలి ఎమ్మెల్యే అయిన పత్తి రాజగోపాల్‌ది కర్నూలు జిల్లా, పత్తికొండ తాలూకాలోని తుగ్గలి గ్రామం. రెండో ఎమ్మెల్యే అయిన ఎన్ గాదిలింగప్పది కర్నూలు జిల్లా ఆలూరు తాలూకాలోని బెల్డోణ గ్రామం. ఈయన కుమార్తె నీలావతి కూడా గుత్తి నియోజకవర్గానికి ఎమ్మెల్యే అయ్యారు. మాజీ ఎమ్మెల్యే దివంగత అరికెరి జగదీశ్ కర్నూలు జిల్లా అరికెరకు చెందినవారు. మాజీ ఎమ్మెల్యే కొట్రికే మధుసూదన్ గుప్తా కూడా కర్నూలు జిల్లా డోన్‌కు చెందినవారు. ప్రస్తుత ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి కూడా ఉరవకొండ నియోజకవర్గంలోని కొనకొండ్లకు చెందినవారు. ఆయన 2003లోనే గుంతకల్లుకు చేరి 2019లో ఎమ్మెల్యేగా గెలిచారు. గుత్తి నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే ఎం రాజారాం కూడా కొనకొండ్లకు చెందినవారే అయినా ఆయన స్థానికుడనే చెప్పాలి. 1955లో ఉరవకొండ తాలూకా గుంతకల్లు నియోజకవర్గంలో ఉండేది. కనుక కొనకొండ్ల గ్రామం గుత్తి నియోజకవర్గంలోనే ఉండటంతో రాజారాంను స్థానికుడిగానే భావించాలి. కాగా వలస వచ్చిన వీరిలో పత్తిరాజగోపాల్, గాదిలింగప్ప, నీలావతి, కొట్రికే మధుసూదన్ తొలి ప్రయత్నంలోనే గెలుపు సాధించగా, ప్రస్తుతం ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి (వైసీపీ), అరికెరి జగదీశ్ (కాంగ్రెస్) రెండో ప్రయత్నంలో గెలుపు సాధించారు. ఈ ఎన్నికల్లో బరిలో టీడీపీ అభ్యర్థిగా పోటీలో నిలిచిన గుమ్మనూరు జయరాం కూడా కర్నూలు జిల్లాకు చెందినవాడు కావడం గమనార్హం. ఇప్పటిదాకా టీడీపీ తరఫున ఎన్నికల బరిలో నిలిచిన కర్నూలు జిల్లా అభ్యర్థులందరూ తొలియత్నంలోనే గెలుపు సాధించి ఉండటం విశేషం.

ఉపాధి తరువుపై నిర్లక్ష్యం వేటు

- అనంతపురం జిల్లా కేంద్రంలో కుట్టు శిక్షణ కేంద్రం మూసివేత
- ఉపాధి కోల్పోయిన ఎస్సీ వర్గాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 27: ఎంతో మందికి ఉపాధి కల్పించిన కట్టు శిక్షణ కేంద్రం వైసీపీ పాలనలో మూతపడింది.జిల్లాలో వెనుకబడిన ఎస్సీ వర్గాలకు ఉపాధి, విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ అందించాలనే ఉద్దేశ్యంతో 1986లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అనంతపురంలో కుట్టు శిక్షణ, దుస్తుల ఉత్పత్తి కేంద్రం (ఎన్‌జీపీసీ)ను స్థాపించారు. ఆ కేంద్రంలో మేనేజర్, అసిస్టెంట్ కట్టర్, ఇన్‌స్ట్రక్టర్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్, వర్కర్‌తో పాటు మరో 30 మంది దుస్తులు కుట్టే వారిని నియమించారు. ఆ కేంద్రాన్ని గత ప్రభుత్వా లు దిగ్విజయంగా నడిపాయి. 2018-19లో తెలుగుదేశం ప్రభుత్వం ఒక్కో జత దుస్తులు కుట్టేందుకు ఇదివరకే ఇచ్చే రూ.30లను రూ.80లకు పెంచి అందించింది. దీంతో దుస్తులు కుట్టేవారు రూ. 30 వేలకు పైగానే ఆర్జించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ తొలినాళ్లల్లోనే ఆ కేంద్రాన్ని మూసివేసింది. నా ఎస్సీలు, నా ఎస్టీలంటున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎంతో మంది ఎస్సీ వర్గాలకు ఉపాధినిచ్చిన ఎన్‌జీపీసీని మూతవేయడంపై ఆ వర్గాలు మండిపడుతు న్నాయి.

ఉపాధి పాయే.. విద్యార్థులకు దుస్తులు పాయే..


ఎన్‌జీపీసీ ద్వారా ఎస్సీ వసతిగృహాల్లో వసతి పొందే విద్యార్థులకు ఏడాదికి నాలుగు జతల చొప్పున ఈ కేంద్రం నుంచే స్కూల్ యూనిఫామ్స్‌ను సరప రా చేసేవారు. ఇందుకోసం ప్రత్యేకంగా ముగ్గురు టైలర్లను నియమించి ప్రతిరోజూ ఏదో ఒక హాస్టల్‌కు వెళ్లి ప్రతి విద్యార్థి కొలతలు తీసుకునేవారు. ఆమేరకు జిల్లా వ్యాప్తంగా ఎంత మందికి ఎంత వస్త్రం కావాలో ప్రభుత్వా నికి నివేదికలు పంపి, తెప్పించేవారమని ఆ కేంద్రం ఉద్యోగులు పేర్కొంటు న్నారు. అప్పట్లో ప్రభుత్వం వస్త్రంతో పాటు ఒక్కో జత మెటీరియల్(దారం, గుండీలు, కుట్టు కూలీ తదితర) ధరలకు అనుగుణంగా రూ. 15లు నుంచి రూ. 30లకు పెంచుకుంటూ వచ్చింది. అనంతరం 2018-19 సంవత్సరంలో ఒకేసారి రూ. 80లకు ఆ ధరలను పెంచింది. దీంతో ఆ కేంద్రంలో దుస్తులు కుట్టే దాదాపు 30 మంది వర్కర్లు దుస్తులను పంపిణీ చేసే సమయానికి ఒకొక్కరు దాదాపు రూ. 30 వేల వరకూ ఆదాయాన్ని పొందేవారని పలువు రు ఉద్యోగులు పేర్కొంటున్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కేంద్రాన్ని పట్టించుకోకపోడంతో అందులోని ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. అసిస్టెంట్ కట్టర్, ఇన్‌స్ట్రక్టర్, జూనియర్ అసిస్టెంట్, టైలర్లు, అటెండర్‌లందరూ ఏదో ఒక ప్రభుత్వ శాఖలకు సర్దుబాటు చేయగా మిగిలిన 30 మందికిపైగా వర్కర్లను పట్టించుకోకపోవడంతో వారు ఉపాధిని కోల్పోయారు.



ఉద్యాన రైతులకు మొండిచేయి..!

- ఐదేళ్ల నుంచి స్టేట్ ప్లాన్ పథకాలు రద్దు
- పలు పథకాలకు సబ్సిడీ నిధులు మంజూరు నిలిపివేత
- కలెక్షన్ సెంటర్లు, ఫారం ఫాండ్స్, సోలార్ కోల్డ్ రూంల ఏర్పాటులో నిర్లక్ష్యం

ఉద్యాన పంటలు పండించడంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు దక్షిణాదిలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ పండే అనేక రకాలైన ఉద్యాన పంటలు ఇతర రాష్ట్రాలకే కాదు ఇతర దేశాలకు సైతం ఎగుమతి అవుతుంటాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉద్యాన రైతులకు అనేక రాయితీలు ఉండేవి. జగన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక చాలా పథకాలను రద్దు చేయడంతో రైతులు చేయూత లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయం (ఫైల్)

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 27 : వైసీపీ ఐదేళ్ల పాలనలో అనంత ఉద్యాన రైతులకు మొండి చేయి చూపింది. తెలుగు దేశం పార్టీ హయాంలో ప్రతి ఏడాది ఉద్యాన రైతులకు పలు రకాల రాయితీలు అందేవి. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉద్యాన రైతులకు రాయితీలు తగ్గిస్తూ వచ్చింది. టీడీపీ హయాంతో పోలిస్తే వైసీపీ పాలనలో 50 శాతానికిపైగా నిధులు తగ్గించారు. దీంతో వేలాది మంది ఉద్యాన రైతులు సబ్సిడీ పథకాలకు దూరమాయ్యరు. గత ఐదేళ్లల్లో ప్రతి ఏడాది అరకొరగా విధించిన టార్గెట్లకు సంబంధించి నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో రైతుల నుంచి నిలదీతలను తట్టుకోలేక ఆ శాఖ అధికారులు పలు పథకాలకు రైతుల ఎంపిక చేయలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడారు. వైసీపీ పాలకుల వైఖరితో అనంత ఉద్యాన రైతులకు ఐదేళ్లల్లో తీరని అన్యాయం జరిగింది.

టీడీపీ హయాంలో ఉద్యాన పథకాల అమలు..

సంవత్సరం	పథకాల అమలు (హెక్టార్లల్లో)	నిధుల విడుదల (కోట్లల్లో)
2014- 15	49,624.99	2.97
2015- 16	10,0310.13	9.34
2016- 17	40,964.76	8.24
2017- 18	5,322.58	9.66
2018- 19	5,261.31	10

వైసీపీ పాలనలో ఉద్యాన పథకాల అమలు తీరిదీ...

సంవత్సరం	పథకాల అమలు (హెక్టార్లల్లో)	నిధుల విడుదల (కోట్లల్లో)
2019- 20	2,804.03	4.17
2020- 21	2,062.61	5.25
2021- 22	2,594.05	6.77
2022- 23	4,001.4	3.62
2023- 24	2,209.98	2.94

స్టేట్ ప్లాన్ పథకాలు రద్దు..

ఉద్యాన శాఖలో ఎక్కువ శాతం పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. టీడీపీ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్టేట్ ప్లాన్‌లో పలు రకాల పథకాలను అమలు చేసింది. తద్వారా ఉమ్మడి అనంత జిల్లాకు ఏడాదికి రూ.10 కోట్లకుపైగా నిధులు కేటాయించారు. ఈ పథకంలో ఎస్సీ ఎస్టీ రైతులకు 75 శాతం రాయితీ వర్తింపజేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే స్టేట్ ప్లాన్ పథకాన్ని పూర్తిగా ఎత్తేశారు. దీంతో ఆయా రైతులు నష్టపోయారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం

గత ఐదేళ్లల్లో ఉద్యాన రైతులకు పలు రకాల పథకాల అమలులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించింది. రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజన (ఆర్‌కేవీవై) పథకం ద్వారా కలెక్షన్ సెంటర్లు, సోలార్ కోల్డ్ రూమ్స్ ఏర్పాటులో తీవ్ర నిర్లక్ష్యం వహించారు. ప్రతి ఏడాది అరకొరగా ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయలేకపోయారు. మరోవైపు ఆర్‌కేవీవై పథకంలో కొత్త పంటల విస్తీర్ణంపెంపుతోపాటు పలు రకాల పంటల రెండో సంవత్సరం నిర్వహణకు లక్ష్యం మేరకు నిధులు విడుదల చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఆయా రైతులు నష్టపోవాల్సి వచ్చింది. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ (ఎంఐడీహెచ్) పథకం ద్వారా మామిడి, జామ, చీనీ, దానిమ్మ, అరటి, బొప్పాయి, ఫ్లవర్ తదితర పంటల విస్తీర్ణంతోపాటు ప్లాస్టిక్ మల్చింగ్, ఫారం ఫాండ్స్, ప్యాక్ హౌస్, ఉద్యాన యాంత్రీకరణ తదితర వాటికి నిధులు మంజూరు చేయలేదు. పలు పథకాలకు ఎంపిక చేసిన రైతులు తమ వాటా డబ్బులు కట్టేందుకు సిద్ధంగా ఉన్నా ప్రభుత్వం నుంచి సబ్సిడీ సొమ్ము విడుదలలో జాప్యంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది.

తీరని అన్యాయం

వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉద్యాన రైతులకు ఆశించిన స్థాయిలో పథకాలు వర్తించలేదు. అరకొరగా అందించే సబ్సిడీలు కూడా ఆలస్యం చేసి తీరని అన్యాయం చేశారు. ఉద్యాన శాఖకు బడ్జెట్‌ను పెంచి కరువు జిల్లా ఉద్యాన రైతులకు చేయూతనివ్వాల్సిందిపోయి ప్రతి ఏడాది తగ్గించడం దుర్మార్గం. వైసీపీ పాలనపై ఉద్యాన రైతులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు.



- మల్లికార్జున, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

సబ్సిడీలు భారీగా తగ్గింపు

టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే వైసీపీ పాలనలో ఉద్యాన రైతులకు భారీగా సబ్సిడీలు తగ్గించారు. గత ప్రభుత్వంలో చిన్న,సన్నకారు ఉద్యాన రైతులకు ఆశించిన స్థాయిలో సబ్సిడీలు వర్తింపజేసి చేయూతనిచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో ఉద్యాన రైతులకు మొండి చేయి చూపారు. పలు రకాల ఉద్యాన సబ్సిడీలు రద్దు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.



- శివారెడ్డి, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

కాళ్ళకూరి నారాయణరావు (జయంతి)



బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన కాళ్ళకూరి నారాయణరావు 1871 ఏప్రిల్ 28న పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరము మండలం మత్స్యపురి గ్రామంలో జన్మించారు. నాటకకర్త, సంఘ సంస్కర్త, ప్రథమాంధ్ర ప్రచురణ కర్త, జాతీయవాది, ఛాయాగ్రహణ విద్యాదురంధరుడు, మహాకవి బిరుదాంకితుడు. చింతామణి, వరవిక్రయం, మధుసేవ వంటి నాటకాలు ఎంతో పేరొందాయి. ఇతర రచనలు సంసార నటన, కారణం లేని కంగారు, దసరా తమాషాలు, లుబ్ధగ్రేసర చక్రవర్తి, రూపాయి గమ్మత్తు, ఘోరకలి వంటి రచనలు ఆదరణ పొందాయి. ఇవి తెలుగు సినిమాలుగా కూడా ప్రదర్శించబడి విజయం సాధించాయి. 1927 జూన్ 27న కన్నుమూశారు.

భమిడిపాటి కామేశ్వరరావు (జయంతి)



భమిడిపాటి కామేశ్వరరావు 1897 ఏప్రిల్ 28న పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో జన్మించారు. రచయిత, నటుడు, నాటక కర్త. ఉపాధ్యాయుడిగా పని చేస్తూ చాలా నాటకాలు, నాటికలు, కథలు రచించారు. సమకాలీన సాంఘిక సమస్యలను హాస్యరసానురంజకంగా మలచిన ప్రజ్ఞాశాలి. తద్వారా 'హాస్యబ్రహ్మ'గా కొనియాడబడ్డారు. త్యాగరాజు రచనలను జీవితాన్ని చక్కగా పరిశీలించి రాగ, తాళ వాద్యాలను ఆ గాయకుడి భావానికి అనుగుణంగా సమకూర్చి వివరిస్తూ 'త్యాగరాజు ఆత్మ విచారం' అనే రచన చేశారు. తన జీవితంలో జరిగిన విశేషాలు, సంఘటనలను జీవితచరిత్ర పుస్తకంలో వివరించారు. 1958 ఆగస్టు 28న పరమపదించారు.

భాను అథయా (జయంతి)




భాను అథయా 1929 ఏప్రిల్ 28న మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జన్మించారు. కాస్ట్యూమ్ డిజైనర్‌గా రాణించిన ఆమె దేశంలో తొలి ఆస్కార్ అవార్డును 1982లో 'గాంధీ' సినిమాకు అందుకున్నారు. వందకు పైగా సినిమాలకు పనిచేశారు. గురుదత్, యశ్‌చోప్రా, బీఆర్ చోప్రా, రాజ్‌కపూర్, విజయ్ ఆనంద్ వంటి ప్రముఖ దర్శకులతో కలసి ఐదు దశాబ్దాలపాటు పని చేశారు. రెండు జాతీయ పురస్కారాలు ఇతర అవార్డులు పొందారు. 2020 అక్టోబరు 15న కన్నుమూశారు.

ఏజీ కృష్ణమూర్తి (జయంతి)



అచ్యుతాని గోపాల (ఏజీ) కృష్ణమూర్తి 1942 ఏప్రిల్ 28న గుంటూరుజిల్లా వినుకొండలో జన్మించారు. దేశంలో పేరొందిన ముద్రా కమ్యూనికేషన్స్ సంస్థ సంస్థాపకులు, ఛైర్మన్. ప్రకటనల రంగంలో దేశంలోనే పేరొందిన సంస్థగా అభివృద్ధి చేశారు. పదవీ విరమణ తర్వాత కాలమిస్టుగా, రచయితగా ఆంగ్లంలోనూ, తెలుగులోనూ పలు వ్యాసాలు, పుస్తకాలు ప్రచురించారు. ఆయన పుస్తకాలు ఇతర భారతీయ భాషల్లోకి అనువాదమయ్యాయి. 2016 ఫిబ్రవరి 5న కన్నుమూశారు.

ఖదీర్‌బాబు (పుట్టినరోజు)



తెలుగు చిన్నకథల రచయితగా గుర్తింపు పొందిన మొహమ్మద్ ఖదీర్‌బాబు 1972 ఏప్రిల్ 28న నెల్లూరు జిల్లా కావలిలో జన్మించారు. పాత్రికేయుడిగా, తెలుగు సినిమా స్క్రిప్ట్ రైటర్‌గా రాణించారు. స్థానిక యాసకు అనుగుణంగా, సంప్రదాయాలకు అద్దంపట్టేలా కథలు ఉండడం ప్రత్యేకత. దర్గామిట్టకథలు, పోలేరమ్మ బండ కథలు, న్యూ బాంబే టైలర్స్ పప్పుజాన్ కథలు, బియాండ్ కాఫీ వంటి రచనలు ఎంతో పేరొందాయి. ఓనమాలు, బ్రహ్మోత్సవం, మనమంతా తదితర సినిమాలకు డైలాగ్ రైటర్‌గా గుర్తింపు పొందారు.

నేడు టీసీఎస్ వరల్డ్ 10కే మారథాన్

- నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు
- ముందస్తుగా నమ్మమెట్రో సేవలు ఆరంభం



మారథాన్ వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులతో పోలీసులు

బెంగళూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో టీసీఎస్ వరల్డ్ 10కే మారథాన్ ఈనెల 28న ఆదివారం జరగనుంది. ఫీల్డ్‌మార్షల్ శ్యామ్ మాణిక్ షా పరేడ్ మైదానం నుంచి మారథాన్ ప్రారంభం కానుంది. ప్రజలు మారథాన్‌లో పాల్గొనే వీలుకోసం మెట్రో రైలుసేవలు ముందస్తుగా ప్రారంభమవుతాయన్నారు. తెల్లవారుజామున 4 గంటలనుంచి 10వరకు బెంగళూరు ప్రముఖ వీధులలో కొనసాగనున్న తరుణంలో ట్రాఫిక్‌ను కొద్దిమేరకు మార్పులు చేశారు. విధానసౌధవైపు వెళ్లే వాహనాలను కేఆర్ సర్కిల్‌లో రూట్ మార్పు చేసి పోలీస్ కార్నర్‌వైపు వెళ్లేలా చేశారు. ఉదయం 4నుంచి 8వరకు ఈ మార్గంలో వాహనాలను అనుమతించరు. అలాగే బాళేకుంద్రి సర్కిల్ నుంచి విధాన సౌధ వరకు వాహనాలను బాళేకుంద్ర సర్కిల్‌లో మార్పు చేసి కన్నింగ్‌హ్యామ్ రోడ్డుపై మళ్లించారు. (ఉదయం 4 నుంచి 8వరకు), కబ్బన్‌రోడ్డులోని మణిపాల్ సెంటర్ నుంచి సీటీఓ సర్కిల్ వరకు రెండువైపులా వాహన సంచా రాన్ని నిర్బంధించారు. (తెల్లవారు జామున 4 నుంచి 10.30 వరకు), అలాగే కాఫీబోర్డ్ నుంచి వచ్చే అన్ని వాహనాలను సీటీఓ సర్కిల్‌వైపు మళ్లించే అవకాశం ఉండదు. ట్రాఫిక్ హెడ్‌క్వార్టర్ జంక్షన్ నుంచి నేరుగా వెళ్లాల్సి ఉంటుంది (తెల్లవారుజామున 4 నుంచి 10వరకు). అలాగే ఇందిరా నగర్, కేఆర్‌పురం, వైట్‌ఫీల్డ్ నుంచి వచ్చే వాహనాలను ఆంజనేయ జంక్షన్‌లో హలసూరు లేక్ వైపు కుడివైపు వెళ్లే అవకాశం లేదన్నారు. సింధి కాలనీ జంక్షన్‌లో అస్సాయ్ రోడ్డుకు వెళ్లే అన్ని వాహనాలను నిర్బంధించి వీలర్స్ రోడ్డు, సెయింట్‌జాన్స్ చర్చ్ రోడ్డు మీదుగా మళ్లిస్తున్నారు. కాగా మారథాన్‌సాగే ప్రముఖ రహదారులలో వాహనాల పార్కింగ్‌కు అవకాశం ఉండదు.

ప్రత్యేకంగా పార్కింగ్ సదుపాయం

కాగా మారథాన్‌లో పాల్గొనేవారు తమ వాహనాలను కంఠీరవ క్రీడా మైదానం, వన్ ఎంజీ మాల్, గరుడామాల్, ఆర్మీ పబ్లిక్‌స్కూల్ వద్ద (సీనియర్ సిటిజన్‌లు, బస్సుల) కోసం, మణిపాల్ సెంటర్ (మీడియా వాహనాలకు) పార్కింగ్‌కు అవకాశం కల్పించారు. ఆదివారం తెల్లవారు జామున 4.10 గంటలకు మెట్రో రైలు సేవలు ప్రారంభమవుతాయని నమ్మమెట్రో అధికారులు తెలిపారు.

భద్రతా సిబ్బందికి భోజనం సరఫరా



భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

చింతామణి, ఏప్రిల్ 27: సమాజంలో శాంతిభద్రతలను కాపాడే పోలీసులంటే ప్రజలలో మంచి అభిమానం ఉంది. లోక్‌సభ ఎన్నికల వేళ బందోబస్తులో పాల్గొన్న పోలీసులు, భద్రతా సిబ్బంది పట్టణంలోని ఝాన్సీ మైదానంలోని దుకాణ సముదాయంలో ఉన్న మాతృశ్రీ అంబాని చిట్‌ఫండ్ ప్రైవేట్ సంస్థ యజమాని మంజునాథ్ నేతృత్వంలో ఉచిత భోజన వ్యవస్థ కల్పించారు. ఎన్నికల విధులకోసం నాగాల్యాండ్ నుంచి భద్రతా సిబ్బంది వచ్చారు. వివిధ జిల్లాలనుంచి కూడా పోలీసులు వచ్చారు. ఇలా అందరికీ శాకాహార, మాంసాహార భోజన వ్యవస్థను కల్పించి తమ ఉదారతను చాటుకున్నారు. పట్టణంలోని ఆశ్రయ లే అవుట్ హాస్టల్, ఇతర ప్రాంతాల్లో బిడారాలు ఏర్పాటు చేసుకున్న సుమారు 200మంది శుక్రవారం రాత్రి పోలింగ్ ముగిశాక వెనుతిరిగారు. శాకాహారులకు చపాతి, కుష్కా, దాల్, పెరుగు పచ్చడి, అలాగే మాంసాహార ప్రియులకు చపాతి, కోడిగుడ్డు, చికెన్ బిరియాని, చికెన్ సాంబారు. చికెన్ కబాబ్, స్వీట్స్ వడ్డించారు. ఈ సందర్భంగా చిట్‌ఫండ్ సంస్థ సభ్యులు నరసింహప్ప, వరలక్ష్మి, స్నేహితులు రామణ్ణ, భత్తలహళ్ళి బీజేపీ ప్రముఖుడు శ్రీనివాసప్ప, రవి, కార్పెంటర్ శీనా, హోటల్ ముబారక్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందురోజు వాసవి ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో భోజన వ్యవస్థ కల్పించారు. ఇలా ఎన్నికల విధులలో పాల్గొన్న పోలీసులకు తగిన రీతిలో స్వచ్ఛంద సంస్థలు భోజన వ్యవస్థ కల్పించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

బ్రేక్‌కు బదులు యాక్సిలేటర్.. వరుస వాహనాలు ఢీ



దెబ్బతిన్న ఇతర వాహనాలు

బెంగళూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన అంబులెన్స్ ఒకటి ఆగియున్న కారును ఢీ కొంది. ఈ సందర్భంగా గాబరా చెందిన డ్రైవర్ బ్రేక్‌కు బదులుగా యాక్సిలేటర్ తొక్కడంతో వరుస వాహనాలను ఢీ కొన్నాడు. అయితే అందరూ ప్రాణాలతో బయటపడ్డారు. శుక్రవారం రాత్రి సుమారు 10.45 గంటలకు బ్యాటరాయనపుర ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుడ్డదహళ్ళి వద్ద ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో బైక్ చోదకుడి కాలుకు, కారు డ్రైవర్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి. అత్యవసరంగా రావాలని ఫోన్‌కాల్ రావడంతో అంబులెన్స్ డ్రైవర్ సుమంత్ స్పందించాడు. మార్కెట్ నుంచి గుడ్డదహళ్ళి మార్గంలో వస్తుండగా అదుపు తప్పి పార్కింగ్ చేసిన కారును ఢీ కొన్నాడు. ఈ సందర్భంగా కంగారులో బ్రేక్‌కు బదులు యాక్సిలేటర్ తొక్కడంతో ఇతర వాహనాలను ఢీ కొన్నాడు. ఈ సందర్భంగా కారులోని నాలుగు నెలల గర్భిణి బయటపడడం ఊరటనిచ్చే అంశం. గాయపడిన ఇతరులను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బ్యాటరాయనపుర ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. అంబులెన్స్ డ్రైవర్ సుమంత్‌ను అదుపులోకి తీసుకున్నారు.

మలేరియా నివారణకు పాటుపడదాం



మలేరియా నివారణపై జాగృతి

విజయపుర, ఏప్రిల్ 27: మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా అందరం పాటుపడదామని స్థానిక సముదాయ ఆరోగ్యకేంద్రం వైద్యురాలు డాక్టర్ రమ్యశ్రీ అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని సమదాయ ఆరోగ్యకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక జాగృతిలో ఆమె మాట్లాడారు. వరల్డ్ మలేరియా డేలో భాగంగా ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనాఫిలిస్ దోమ ద్వారా ప్రబలే మలేరియా నివారణకు తగిన చర్యలు చేపట్టామన్నారు. చుట్టుపక్కల ప్రాంతాలలో స్వచ్ఛత పాటించాలన్నారు. స్వచ్ఛతతోనే రోగాల నివారణ సాధ్యమన్నారు. చలిజ్వరం, తలనొప్పి, వాంతులు ఇతరత్రా అనారోగ్యానికి గురైతే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. డాక్టర్ రమేశ్, శ్రీధర్, సీనియర్ ఆరోగ్య సహాయకులు సునిత, నయన, అరుంధతి, ల్యాబ్ టెక్నీషియన్ మంజునాథ్, ఆసుపత్రి సహాయక సిబ్బంది కళావతి, వరలక్ష్మి, పృథ్విరాజ్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో కొరవడిన నిఘా

యథేచ్ఛగా తరలివస్తున్న మద్యం, డబ్బు



యు రంగాపురం వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు

మడకశిర రూరల్, ఏప్రిల్ 27 : ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలంటే డబ్బుమద్యం అక్రమ రవాణాను నిరోధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మడకశిర నియోజకవర్గం పూర్తిగా కర్ణాటక సరిహద్దు ప్రాంతం. దీంతో కర్ణాటక నుంచి మద్యం అక్రమ రవాణా ఇక్కడ సర్వసాధారణం. ఎన్నిల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి మరిం త ఎక్కువైనట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. అయితే నిఘా బృందాల పర్యవేక్షణ అంతంతమాత్రమే ఉందని ప్రజలు వాపోతున్నారు. సార్వత్రిక ఎన్నిల నోటిఫికేషన్ మార్చి16 వెలువడింది. అప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ఎన్నికల నిబంధన మేరకు ఆ రోజు నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వయిలెన్స్ నిరంతరం నియోజకవర్గంలో పర్యవేక్షణ చేయాలి. అయితే సరియైన నిఘా లేకపోవడంతో కర్ణాటక నుంచి మద్యం, డబ్బు నియోజకవర్గంలోకి విచ్చల విడిగా వస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. నిఘా బృందాలను ఏర్పాటుచేసినా వారికి సరియై వాహనాల సౌకర్యాలు కల్పించకపోవడం, కల్పించినా వాహనాలకు ఇందన సదుపాయం కల్పించకపోవడంతో ఆ బృందాలు నామమాత్రంగా తిరుగుతున్నట్లు ప్రజలంటున్నారు. మడకశిర నియోజకవర్గం చుట్టూ కర్ణాటక సరిహద్దు ఉంది. అక్కడ నుంచి డబ్బు, మద్యం అక్రమంగా సరఫరా అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన మార్చి 16 నుంచి ఇప్పటి వరకు తనిఖీల్లో కేవలం రూ.10 లక్షలు పట్టుకున్నారు. సంబంధిత వ్యక్తులు వాటికి సంబంధించి ఆధారాలు చూపగానే ఆ మొత్తాన్ని తిరిగి ఇచ్చారు. మడకశిర నియోజకవర్గం పూర్తిగా కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావున మిగిలిన నియోజకవర్గాల కంటే ఇక్కడ సీజ్ మొత్తం ఎక్కువగా ఉండాలి. అయితే నిఘా బృందాల పర్యవేక్షణ సరిగాలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. అలాగే నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని కర్ణాటక సరిహద్దులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులలో కనీస సౌకర్యాలు కొరవడినాయి. అలాగే విద్యుత్, సౌకర్యాలు లేకపోవడంతో వాహన తనిఖీల్లో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవి కాలం అక్కడ పనిచేసే సిబ్బంది తాగునీరు, భోజన వసతి లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల నిధులు విడుదలైనా సరిగా వాటిని సిబ్బందికి ఖర్చు పెట్టడంలేదనే విమర్శలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికాలు స్పందించి తగుచర్యలు తీసుకుని సరిహద్దు చెక్ పోస్టులలో గట్టి నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



గౌరిపురం సరిహద్దులో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

ఇప్పటి వరకు ఎన్నిల నిధులు రాలేదు

ఎన్నిల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నిల నిధులు విడుదల కాలేదు. ఫ్లయింగ్ స్క్వాడ్, వాహనాలకు అడ్వాన్సుగా ఒక్కో వాహనానికి రూ.10 వేలు మాత్రం చెల్లించాం. ఎన్నికల నిధులు విడుదల కాగానే పూర్తి స్థాయిలో చెల్లింపులు చేపడుతాం.

- బాలాంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్, మడకశిర

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 27: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం సందర్భంగా విశేషపూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు సంతోష్‌కుమార్‌చార్యులు పూజలు నిర్వహించారు. వేకువజామున, సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నిర్మల్య విసర్జన, విష్ణు పారాయణం, అష్టోత్తర నిర్వహించి వెండికవచ అలంకరణ, పుష్పలంకరణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదాన చేశారు. సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు. మాజీ ధర్మకర్త కాశీనాథ్‌శెట్టి సిబ్బంది ఓబున్న పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలో వెలసిన అప్పలాపురం ఆంజనేయస్వామి దేవాలయం, మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాలలో ఉదయాన్నే పంచామృతాభిషేకం, కుం కుమార్చన, వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



మొరాయించిన బస్సును తోస్తున్న ప్రయాణికులు

రొళ్ల-అగళి ప్రయాణించే ఆర్టీసీ బస్సు హొట్టెబెట్ట వద్ద హైవేపై శనివారం ఆగిపోయింది. తిరిగి స్టార్ట్ కాకుండా మొరాయించింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఇక విధిలేని పరిస్థితుల్లో అది స్టార్ట్ అయ్యే వరకు దానిని తోయాల్సి వచ్చింది. అసలే వేసవి కాలం కావడంతో మండు టెండలో వారి అవస్థలు వర్ణనాతీతం. దీంతో విసిగి పోయిన ప్రయాణికులు కండీషన్ ఉన్న బస్సులను నడపాలని అసహనం వ్యక్తం చశారు. - రొళ్ల

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు



సుధాకర్‌రెడ్డిని స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

లేపాక్షి, ఏప్రిల్ 27 : తాగుడుకు బానిసై జీవితంపై విరక్తిచెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి శనివారం పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అతడిని రక్షించినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. మండలకేంద్రమైన లేపాక్షి గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసై మగ్గం పనిపై ధ్యాసపెట్టలేకపోయాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతడు శనివారం లేపాక్షి చెరువులోకి వెళ్లి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ గోపి సిబ్బందితో సకాలంలో ఘటనా స్థలాని కి చేరుకుని అతడి ఆత్మహత్యాయత్నాన్ని నివారించి , స్టేషన్‌కు తరలించారు. కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి బాధితుడిని వారికి అప్పజెప్పారు. సకాలంలో స్పందించిన పోలీసులను స్థానికులు అభినందించారు.

లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో విశేషపూజలు



విశేష అలంకరణలో శ్రీవారు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 27: తాలూకా వ్యాప్తంగా శనివారం పురస్కరించుకుని పలు వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు సాగాయి. తలకాయలబెట్టపై కొలువైన శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామికి సుప్రభాత సేవ, ఆలయశుద్ధి, అభిషేకం నిర్వహించారు. అలంకరణ అనంతరం ధూపదీప నైవేద్యాలు స్వామివారికి సమర్పించారు. తదుపరి భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. బెళ్లూటిలోని ఆలయంలోనూ, వాసవిరోడ్డులోని ఆలయంలోనూ, పిలేచర్ క్వార్టర్స్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయం, బ్యాటరాయస్వామి ఆలయం, వీరాంజనేయస్వామి ఆలయంలో, తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి.

కుటుంబాల గొడవలో చిన్నారి బలి



శ్రీనిధి (ఫైల్)

బెంగళూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రెండు కుటుంబాల మధ్య గొడవ చివరకు ఒక చిన్నారిని బలిగొంది. బెళగావి జిల్లా అథణి తాలూకా బుర్లట్టి గ్రామంలో హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. శ్రీనిధి కాడప్ప కాళాపాటిల్ (3) మృతి చెందిన చిన్నారి. జోతిబా తుకారామ్ బాబా అనే వ్యక్తి కుటుంబాల గొడవల నేపథ్యంలో చిన్నారి ఛాతీపై కాలి పెట్టి తొక్కాడని చిన్నారి కుటుంబీకులు ఆరోపిం చారు. ఘటనా స్థలాన్ని ఐగళి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రైలు కిందపడి బెంగాల్ వాసి మృతి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 27: గుంతకల్లు-అనంతపురం రైలు మార్గంలోని గూళ్లపాళ్యం రైల్వేస్టేషన్ సమీపంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన విశ్వజీత్ సన్మల్ (29)అనే వ్యక్తి శనివారం రైలు కింద పడి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. మృతుడి వద్ద ఆధార్ కార్డులో వెస్ట్‌బెంగాల్ రాష్ట్రం నారాయణ్‌భర్ అడ్రసు ఉందన్నారు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీంచి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య


యాడికి, ఏప్రిల్ 27: ఇంట్లో సరుకుల కోసం భర్తతో గొడవపడి విషద్రావకం తాగి శ్రావణి (36) అనే మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం యాడికి మండలం కోనుప్పలపాడులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు కోనుప్పలపాడు గ్రామానికి చెందిన శ్రావణి, వీరబ్రహ్మాయ్య వ్యవసాయ పనుల ద్వారా జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంట్లో సరుకులు లేవని భార్యాభర్తలు శనివారం గొడవపడ్డారని తెలిపారు. క్షణికావేశంలో శ్రావణి విషద్రావకం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. శ్రావణి తండ్రి రంగస్వామి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హిజ్రా...

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 27: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనక నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో హిజ్రా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు కోలాట్ల విజయ్ అలియాస్ విద్య(17) రెండు సంవత్సరాల క్రితం హిజ్రాగా మారిందన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఉరివేసుకుని అత్మహత్య చేసుకుందన్నారు. గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని వారు పరిశీలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కార్డెన్ సెర్చ్

యల్లనూరు, ఏప్రిల్ 27: మండలకేంద్రంలో శనివారం తెల్లవారుజామున రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ గృహాల్లో తనిఖీలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎటువంటి కవ్వింపు చర్యలకు దిగరాదని హెచ్చరించారు. ఆయన వెంట యల్లనూరు ఎస్ఐ గిరిబాబు, కేంద్రబలగాలు ఉన్నాయి.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.36	1,576.13
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	169	258
సామర్థ్యం (టీఎంసీలు)	3.73	2.87

మోదీ సభకు భారీ ఏర్పాట్లు

● నేడు హోసపేటకు ప్రధాని రాక

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 27: ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం ఆదివారం సాయంత్రం విజయనగర జిల్లా కేంద్రమైన హోసపేట నగరానికి విచ్చేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా హెలిప్యాడ్, బృహత్ వేదిక ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. బళ్లారి, కొప్పళ, రాయచూరు నియోజకవర్గాల కోసం ప్రధాని ముఖ్యంగా ప్రచారం చేయనున్నారు. ముఖ్యంగా నియోజకవర్గాలలో పోటీచేసే అభ్యర్థులతో పాటు బి.ఎస్.యడియూరప్ప, బి.వై.విజయేంద్రలు మాత్రమే వేదికపై కూర్చునేందుకు అవకాశం కల్పించారు. సుమారు 25వేల మంది కోసం ఆసనాలు ఏర్పాటుచేస్తున్నారు. మొత్తం 50వేలమందికి పైగా పాల్గొనే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మోదీ పర్యటనలో భాగంగా ఎస్‌పిజి భద్రతా వ్యవస్థ తనిఖీలు పూర్తయ్యాయి. వాయుసేన హెలికాప్టర్లు శుక్రవారం చాలా సార్లు నగరం చుట్టూ చక్కర్లు కొట్టాయి. భట్రహళ్ళి ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద హెలిప్యాడ్, టేకాఫ్‌కు అవసరమయ్యే పనులు పూర్తయ్యాయి. మోదీ హోసపేట నగరానికి రావడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ సమావేశానంతరం ప్రధాని సోమవారం బాగలకోటకు వెళతారని తెలుస్తోంది.


మోదీ సభ కోసం జోరుగా సాగుతున్న ఏర్పాట్లు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


కంప్లి రోడ్‌షోలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్

కంప్లి, ఏప్రిల్ 27 : కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. కంప్లి పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి ఈ తుకారామ్ ఉద్భవ గణపతి నుంచి అంబేద్కర్ సర్కిల్ కూడలి వరకు రాజ్‌కుమార్ రోడ్‌లో రోడ్‌షో చేపట్టారు. గతంలో ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు, ఎంపీలు ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకులు తమదైన శైలిలో అభివృద్ధి చేపట్టి గుర్తింపుపొందారన్నారు. అలాగే పథకాలు కూడా అందించారన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వల్ల విసుగుచెందారని, అలాగే కుల, మత భేదాలతో చిచ్చు పెడుతూ రాష్ట్రాన్ని పూర్తిగా అభివృద్ధి లేకుండా చేస్తున్నారన్నారు. తమ నాయకులు సిద్దరామయ్య, డీకే శివకుమార్ ఐదు పథకాలతో పరిపాలన అందిస్తున్నారన్నారు. పూర్తిగా పేద ప్రజలకు, విద్యార్థులకు ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, మహిళలకు రూ. రెండు వేలు తదితర పథకాలు అందించి ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. తాము కూడా నాలుగు సార్లు సండూరు నియోజకవర్గాన్ని ఆదర్శ క్షేత్రంగా తీర్చిదిద్దామన్నారు. జిల్లా వాసులు కూడా తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపిస్తే జిల్లాను కూడా ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శివయోగి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసరావు, ఏకాంబరం, చెన్న బసవనగౌడ, శివశంకర్‌గౌడ, షణ్ముఖప్ప, సుధీర్, కరిబసవనగౌడ, మల్లికార్జున, మనోహర్, హబీబ్ రెహ్మాన్, కంబళి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం



బళ్లారి సిటీ, ఏప్రిల్ 27: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నిత్యావసర సేవల విభాగంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ పత్రాల ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించినట్లు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ పత్రాల ద్వారా ఓటు వేయడానికి మే 1నుండి 3వ తేది వరకు సిటీ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న జిల్లా కలెక్టర్ కార్యాలయం గాంధీభవన్ వద్ద పోస్టల్ పోలింగ్ కేంద్రం ప్రారంభించారు. ఇక్కడ అత్యవసర సేవల విభాగంలో పనిచేసే అధికారులు, సిబ్బంది ఓటు వేయవచ్చని ఆయన తెలిపారు.

నవ బృందావనంలో ప్రత్యేక పూజలు


నవ బృందావనంలో సుబుధేంద్ర తీర్థ స్వామి

కంప్లి, ఏప్రిల్ 27 : అనెగొంది తుంగభద్ర నది వద్ద వెలసిన నవ బృందావనంలో వాగేష్ తీర్థులకు శనివారం మధ్యారాధన పూజలు జరిగాయి. మంత్రాలయ రాఘవేంద్ర స్వామి పీఠాధిపతి సుబేంద్ర తీర్థులు బృందావనంలో వాగేష్ తీర్థుల బృందావనానికి ప్రత్యేక పూజలుచేశారు. పంచామృతాభిషేకం, అష్టోత్తర పారాయణం, భజనలు, పుష్పాలంకరణ తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ద్వారక నందాచారి, నరహరి ఆచారి, రాఘవేంద్రరావు, కులకర్ణి, హనుమంతరావు, సురేంద్రాచారి, సుమంత్ కులకర్ణి, పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న తాలుకా పంచాయతీ మేనేజర్ బసవరాజు

సిరుగుప్ప, ఏప్రిల్ 27 : ఓటు వేయడం మన హక్కు అని తాలుకా పంచాయతీ మేనేజర్ బసవరాజు తెలిపారు. శనివారం సిరుగుప్ప పట్టణ తాలుకా పంచాయతీ భవనంలో ఓటు హక్కుపై జనజాగృతి అవగాహన జరిగింది. ఈ కార్యక్రమంలో బసవరాజు మాట్లాడుతూ ప్రజాప్రభుత్వ పరిపాలనలో ప్రజలే దేవుళ్లని, వారి ఓటును ఆచి తూచి వేయాలని తెలిపారు. ఈ సందర్భంగా తాలుకా పంచాయతీ సహాయ అధికారిణి సుజాత, సమాజ సేవకులు అబ్దుల్ నబీ, పంచాయతీ సిబ్బంది, తాలుకా ప్రజలు పాల్గొన్నారు.

కారులో రూ.2కోట్ల నగదు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కారు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 27: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కర్ణాటకలో ఐటీ శాఖ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే శనివారం గుల్బర్గా రైల్వే స్టేషన్ వద్ద ఐటీ అధికారులు జరిపిన దాడుల్లో రెండు కోట్ల రూపాయల నగదు జప్తు చేశారు. ఓ వ్యక్తి రైలు నుండి దిగి కారు ఎక్కుతున్న సమయంలో ఐటీ అధికారులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఆ వ్యక్తి వద్ద రెండు కోట్ల రూపాయల నగదు ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం నగదు, కారును ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు స్వాధీనం చేసుకున్న కారు కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మేయర్‌కు చెందినదిగా అధికారులు గుర్తించారు.

ఎన్నికల వాగ్దానాలు బూటకం: ఎస్‌యూసీఐ

బళ్లారి సిటీ, ఏప్రిల్ 27: బళ్లారి నగరంలో పలుచోట్ల ఎస్‌యూసీఐ కమ్యూనిస్ట్ పార్టీ కార్యకర్తలు వీధి సమావేశాలు నిర్వహించి ప్రజల్లో రాజకీయ చైతన్యం కలిగిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ప్రమోద్ తెలిపారు. ఈ సమావేశాలపై ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో మాదిరిగానే ఈ ఎన్నికల్లోనూ అన్ని పార్టీలు ఎన్నో వాగ్దానాలు చేస్తున్నాయని, ఎన్నికల్లో చేసే వాగ్దానాలు బూటకమని పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, అవినీతి రహిత పరిపాలన సాగిస్తామన్న మోదీ వాగ్దానాలు బూటకమని చెప్పారు. ఈ ఎన్నికల్లో దేశ ఆర్థిక వ్యవస్థను ఐదో స్థానం నుంచి మూడోస్థానానికి చేర్చి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతామన్న హామీలతో మోదీ ప్రజల ముందుకు వస్తున్నారని ఇక్కడ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధా? లేక పెట్టుబడిదారుల అభివృద్ధా? అని ప్రశ్నించారు. ఎందుకంటే గత పదేళ్ల మోదీ పాలనలో అంబానీ, ఆదానీల ఆస్తులు పెరుగతూనే ఉన్నాయని, మరోవైపు పేదల జీవితాలు నరకప్రాయంగా మారాయన్నారు. 2023లో విడుదల చేసిన గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో 125దేశాలలో భారతదేశం 111వ స్థానంలో ఉందన్నారు. మోదీ చెబుతున్న అభివృద్ధి చెందిన భారతదేశానికి ఇది మరో ముఖమన్నారు. ఈరోజు భారతదేశంలో ఈ పరిస్థితికి కాంగ్రెస్ పార్టీ సహకారం కూడా కారణమన్నారు. 'గరీబీ హటావో' నినాదంతో ప్రజలను మభ్యపెట్టి శ్రామిక ప్రజల చెమట పునాదులపై టాటాలు, బిర్లాలను నిర్మించింది కాంగ్రెస్‌పార్టీనేనన్నారు. కాబట్టి వారు ఇచ్చిన హామీలు, పెద్ద ప్రకటనల జోలికి పోకుండా ప్రజలను ఎన్నికల భ్రమ నుంచి బయటికి తీసుకెళ్లి ఎస్‌యూసీఐ పార్టీ పోరాట దిశగా వారిని ముందుకు తీసుకెళుతోందన్నారు. తమ పార్టీ అభ్యర్థి ఏ.దేవదాస్‌కు ఓటు వేయడం ద్వారా శ్రామిక ప్రజలు పార్లమెంటులో తమ గళాన్ని వినిపించాలన్నారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డి.నాగలక్ష్మి, సోమశేఖర్‌గౌడ్, శాంత,నాగరత్న, జగదీశ్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌యూసీఐ పార్టీ వీధి సమావేశంలో మాట్లాడుతున్న ప్రమోద్

మళ్లీ కాంగ్రెస్‌లోకి నారాయణప్ప


నారాయణప్పను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీ అభ్యర్థి తుకారామ్

కంప్లి, ఏప్రిల్ 27 : తాలుకాలోని వాల్మీకి సమాజానికి చెందిన రామసాగర నారాయణప్ప కాంగ్రెస్ పార్టీ నుండి వెళ్లి తిరిగి మళ్లీ సొంతగూటికే చేరారు. కంప్లిలోని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి ఈ తుకారామ్ ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈ తుకారామ్, గణేష్‌లు మాట్లాడుతూ గతంలో నారాయణప్ప కాంగ్రెస్ పార్టీలో ఎన్నో సేవలు చేపట్టారని, గత కొంతకాలంగా బీజేపీలోకి వెళ్లారన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ పథకాలు, సేవలను గుర్తించి తిరిగి సొంత గూడు అయిన కాంగ్రెస్ పార్టీలోకి చేరారన్నారు. ఈ సందర్భంగా నారాయణప్ప మాట్లాడుతూ రాబోయే ఎంపీ ఎన్నికల్లో ఈ తుకారామ్ గెలుపు కోసం తాను ముందుకొచ్చానన్నారు. ఈ ఎన్నికల్లో తమదైన శైలిలో ప్రతి గ్రామంలో ఈ తుకారామ్ గెలుపు కోసం శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. వారితో పాటు ఈసీ శ్రీనివాసరావు, షణ్ముకప్ప, బంగి మల్లయ్య, హబీబ్ రెహ్మాన్, శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి పరాకాష్ట

● జనరద్దీ ఉండే నూతన బస్టాండు వద్ద వెలగని లైట్లు
● రోడ్డు పక్కన పగలు కూడా ఆరని వెలుగులు


కొత్త బస్టాండు వద్ద దిష్టిబొమ్మలా లైటు

కంప్లి, ఏప్రిల్ 27 : కంప్లి పట్టణంలో పలు చోట్ల హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేశారు. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటికీ లైట్లు వెలగక దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. బళ్లారి రోడ్డు షుగర్ ఫ్యాక్టరీ వద్ద పగలు రాత్రి తేడా లేకుండా విద్యుత్ లైట్లు వెలుగుతూనే వుంటాయి. ఎంతో మంది ప్రయాణికులు నిల్చునే కంప్లి నూతన బస్టాండు ప్రాంతంలో మాత్రం హైమాక్స్ లైట్లు వెలగకుండా దిష్టిబొమ్మలుగా నిలిచిపోయాయి. రోడ్డుపక్కన విద్యుత్ లైట్లు మాత్రం పగలు రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. ప్రజలకు కావల్సిన ప్రాంతంలో విద్యుత్ కాంతులు లేకపోగా ప్రజల సంచారం లేని ప్రాంతంలో పగలు రాత్రి లైట్లు వెలుగుతుండటం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు హైమాక్స్ లైట్లకు మరమ్మత్తులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


షుగర్ ఫ్యాక్టరీ వద్ద పగలే వెలుగు

శ్రీరాములు కోసం జాలేహాళ్ గవిసిద్దప్ప ప్రచారం


బీజేపీ లోక్‌సభ అభ్యర్థి గెలుపుకోసం జాలేహాళ్ గవిసిద్ధప్ప ప్రచారం

బళ్లారిరూరల్, ఏప్రిల్ 27 : విజయనగరం జిల్లాలోని నాగేనహళ్లి, అనంతశయన గుడి, కామలాపురం, మల్పనగుడి, హోస్పేట, బండ్రి తదితర ప్రాంతాల్లో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి శ్రీరాములు గెలుపు కోసం అడ్వకేట్ గవిసిద్ధప్ప ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో బీజేపీ ప్రముఖులు బుజ్జల రమేష్, విజయనగర జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు భారతి పాటిల్, రిటైర్డ్ ఏఎస్‌ఐ హనుమంతప్ప, సుబ్రహ్మణ్యం, వరుణ్ కుమార్, పలు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మురుగు నీరే వారికి వరం

● ఆ నీటితోనే చెరుకు, అరటి, మల్లె పంటల సాగు


అరటి పంటకు మురుగు నీరు పారిస్తున్న రైతు

కంప్లి, ఏప్రిల్ 27 : కంప్లి పరిధిలోని విజయనగర కాలువ గత మూడు సంవత్సరాలుగా మరమ్మతులకు గురికావడంతో పట్టణాల నుంచి వచ్చిన మురుగునీటిని రైతులు ఉపయోగించుకునే పరిస్థితి ఏర్పడింది. పట్టణానికి దగ్గరలో వున్న విజయనగర కాలువ ద్వారా వేరూరు విరుపనతాత మఠం వద్ద మురుగునీరు బెళగోడుహాళ్ కాలువకు చేరుతుంది. ఈ కాలువ నుంచి ఈ మురుగునీటిని చుట్టుపక్కల రైతులు చెరుకు, అరటి, మల్లె పంటలకు వాడుకుంటున్నారు. గతంలో తుంగభద్ర నది నుంచి మోటార్ల ద్వారా పంపుసెట్లతో నీరు అందించే వారమని, నదిలో నీరు లేకపోవడంతో ప్రతినిత్యం ఈ మురుగునీటినే ఉపయోగిస్తున్నామన్నారు. గత కొంతకాలంగా పట్టణం నుంచి వచ్చే ఈ మురుగునీటిని పంటలకు అందిస్తున్నామని రైతులు బసప్ప, అశోక్, పూజారి హనుమంతులు తెలిపారు. మరో రైతు తోటగారి తజ్జురు హాలుబావి మాట్లాడుతూ వర్షాభావం వల్ల నీరు లేని సమయంలో ఈ మురుగునీరు అందించినప్పటికీ పంట దిగుబడి వస్తోందని, అయితే మురుగునీటిలో ప్లాస్టిక్, చెత్తా చెదారం లేకుండా కేవలం నీటిని మాత్రమే పంటలకు అందించాలని తెలిపారు.

నీరు.. విలువైన సహజ వనరు: రవి చెళ్లగుర్కి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 27: నీరు విలువైన సహజ వనరు అని వర్షాలు కురిసినప్పుడు నీరు వృథా కాకుండా గుంటలు, రిజర్వాయర్లలో సేకరించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరమ్ అధ్యక్షులు రవిచెళ్లగుర్కి అన్నారు. సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలలో శనివారం వేసవి మధ్యాహ్న భోజనానికి హాజరైన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రముఖ జలాశయాల పరిచయ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. జలసంరక్షణ ఇప్పటిరోజుల్లో ఎంతో అవసరమైందన్నారు. వర్షాలు కురిసే ప్రమాణం తక్కువ అవడుతండడంతో ప్రస్తుతం తాగడానికి నీరు లభించడమే కష్టమవుతోందని, దీని ఫలితంగా ఉష్ణోగ్రత పెరిగి ప్రజలు బయటకురాకుండా ఉండే పరిస్థితి నెలకొందన్నారు. అందుకని రైతులు, జనసామాన్యులు, విద్యార్థులు చుట్టుప్రక్కల స్థలాల్లో చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు.

హోసూరు జోన్

విద్యార్థుల ఉన్నతికి చక్కని బాటలు: హెచ్‌ఎం


ఉర్దూ పాఠశాలలో జరిగిన సమావేశంలో పాల్గొన్న టీచర్లు

హోసూరు, ఏప్రిల్ 27: మున్సిపల్ ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల అభివృద్ధిపై శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వచ్చే విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు ఇతరత్రా అంశాలపై చర్చలు జరిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేవసేన మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి చక్కటి బాటలు వేస్తున్నామన్నారు. ఉర్దూ మీడియంలో ఆసక్తిగల విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పేలా ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యాయులు, జమటార్లు, మాతృభాషా ఉపాధ్యాయ సంఘం నిర్వాహకులు, ఎస్‌ఎంసీ నిర్వాహకులు పాల్గొని పలు తీర్మానాలను ఆమోదించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను నిర్ణయించడం మౌలిక సదుపాయాలను పెంచడం, మరింత క్రమబద్ధీకరించడం, విద్యార్థుల హాజరు, మానిటరింగ్, డ్రాపౌట్ లపై, కఠినమైన క్రమ శిక్షణ పాటిస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేయడం, విద్యార్థులందరూ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. నగరం, జిల్లా, రాష్ట్రస్థాయిలో సత్తా చాటేలా ఇక్కడ విద్యార్థులకు చేయూత ఇస్తున్నట్టు తెలిపారు. ఇక్కడి విద్యార్థులు డాక్టర్, ఇంజనీర్, ఆడిటర్‌లుగా ఎదిగారన్నారు. ఉరూ పాఠశాలలో తమిళం, ఆంగ్లం ప్రైవేట్ పాఠశాలల కంటే ఎక్కువ సౌకర్యాలు ఉన్నాయన్నారు.

వర్షం కోసం కర్నూరులో పూజలు

హోసూరు, ఏప్రిల్ 27: వర్షం కురవాలని గ్రామదేవతలకు పలు చోట్ల విశేషపూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా హోసూరు కర్నూరు గ్రామంలో సరస్సు ఒడ్డున 200 ఏళ్ల నాటి గంగమ్మ దేవాలయాన్ని నరసింహప్ప కుటుంబం పర్యవేక్షిస్తోంది. శనివారం ముక్కోటి కరగమ్మ, గంగమ్మ, మారమ్మ అని ముగ్గురు అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ప్రత్యేకించి వేసవి కాలంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తద్వారా అమ్మవారి కృపతో వర్షాలు కురుస్తాయని గ్రామస్థుల విశ్వాసం.



నిమ్మ, కీరదోసలకు పెరిగిన డిమాండ్



హోసూరు(సిఫ్‌కాట్), ఏప్రిల్ 27: ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు చల్లటి నీరు, మజ్జిగ, కొబ్బరిబోండాం ఇతర పండ్ల రసాలు తీసుకుంటాం. ప్రస్తుతం నిమ్మకాయలకు డిమాండ్ పెరిగింది. హోసూరు రైతు బజారుకు రోజూ ఒక టన్ను వచ్చేది. అయితే కొన్నిరోజులుగా వర్షాభావంతో దిగుబడి తగ్గడంతో 500 కిలోల నిమ్మకాయలు వస్తున్నాయి. ఇలా సరాఫరా తగ్గడంతో కిలో నిమ్మకాయలు రూ.60 నుంచి రూ.120 కి పలుకుతున్నాయి. హోసూరు చుట్టుప్రక్కల రైతులు ప్రతిరోజు రైతు బజారుకు 2 టన్నుల వరకు దోసకాయలు విక్రయిస్తుండగా ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో 5 టన్నుల వరకు విక్రయిస్తున్నారు. వేసవి కాలం ముందు కేజీ కీరదోసకాయ రూ.10 ఉండగా ప్రస్తుతం రూ.40 పలుకుతోంది. ఇలా నిమ్మ, కీరదోసల ధరలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాయచూరులో ప్రచార హోరు..!

రాయచూరు, ఏప్రిల్ 27 : ఇప్పటి వరకు స్థానిక నాయకుల పైనే ఆధారపడిన ఎన్నికల ప్రచారం జోరు అందుకోనుంది. రాష్ట్రంలో ఈ నెల 26వ తేదీన జరిగిన మొదటి విడత ఎన్నికల్లో 14 లోకసభ నియోజక వర్గాల్లో పోలింగ్ పూర్తి కాగా మలిదశ 14 లోకసభ నియోజక వర్గాల్లో మే 7న పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో ఇప్పటి వరకు మొదటి విడత ఎన్నికలు జరగనున్న నియోజక వర్గాల పైనే స్టార్ క్యాంపెయినర్లందరు దృష్టి సారించగా ప్రస్తుతం రెండవ విడత ఎన్నికల ప్రచారంపై దృష్టి సారించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఎన్నికల సభలో పాల్గొననున్నారని మొదట ప్రచారం జరిగినా ఆ సభ రద్దు కావడంతో పాటు నగరంలో సినీ నటుడు పవన్ కల్యాణ్ నిర్వహించనున్న రోడ్డుషో కూడా రద్దు అయినట్లు తెలుస్తోంది. దీంతో ఆ పార్టీ కార్యకర్తల్లో కొంత స్తబ్దత నెలకొంది.

రాయచూరు పరిధిలోని సురపుర అసెంబ్లీ సెగ్మెంట్ ప్రచారంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా పాల్గొనడంతో కార్యకర్తల్లో కొంత ఊపు పెరిగింది. ముఖ్యంగా రాయచూరు లోకసభ నియోజక వర్గంలో కాంగ్రెస్-బీజేపీల మధ్య హోరాహోరి సమరం నడుస్తున్న నేపథ్యంలో రెండు పార్టీల ప్రదాన నాయకులు ఈ నియోజక వర్గంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కాంగ్రెస్ పార్టీ తరపున ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లతో పాటు ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధి ప్రచారానికి రానున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలుపుతున్నారు. బీజేపీ అగ్ర నాయకులు సహితం రాయచూరులో సుడిగాలి పర్యటనలు నిర్వహించి పార్టీ పట్ల ఆకర్షణ పెంచే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది.


కాంగ్రెస్ అభ్యర్థి కుమార్ నాయక్, బీజేపీ అభ్యర్థి అమరేశ్వర్ నాయక్

నేడు నగరానికి నటుడు ప్రకాష్‌రాజ్



రాయచూరు, ఏప్రిల్ 27 : లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 28వ తేదీ ఆదివారం నగరంలో నిర్వహిస్తున్న రాజకీయ జాగృతి సమావేశానికి బహుభాష నటుడు ప్రకాశ్ రాజ్ రానున్నారు. రైతు సంఘం సంయుక్త పోరాట కర్ణాటక సమితి, నవోదయ పార్టీల ఆధ్వర్యంలో నగరంలోని మంత్రాలయం రోడ్డు కర్ణాటక వెల్‌ఫేర్ ట్రస్ట్(కేడబ్ల్యూటీ) పాఠశాల ఆవరణలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు రాజకీయ జాగృతి సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొననున్న ప్రకాశ్ రాజ్ ఇండియా కూటమి అభ్యర్థుల తరపున ప్రజల్లో అవగాహన కల్పించనున్నారని తెలిసింది. అదే సమయంలో బీజేపీ పాలనలో జరుగుతున్న అప్రజాస్వామిక పోకడలపై ఆయన ప్రసంగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.